జిందగీ
చిత్రాలు
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 28 అక్టోబర్ 2024
www.ntnews.com
11

రాసలీలా వైభవం-2

భారతావనిలోని బృందావనం బృహదారణ్యకమని భక్తుల, బ్రహ్మవేత్తల భావం. బృందావనంలోని మట్టి, ఇష్టిక- ఇటుకలు, రాళ్లు-రప్పలు, ఇసుక రేణువులు, వేణువులు- వెదురులు, లతలు, వనస్పతులు, నికుంజ తతులు- పొదరిళ్ల సమూహాలు, గుంజ- గురువెందలు సర్వం కంజాక్షుని- కృష్ణుని స్వరూపాలే, చిన్మయాలే! హ్లాద- ఆనంద స్వరూపుడైన మాధవుని వేణుగానం నాద బ్రహ్మ! అనాది బ్రహ్మచారి అయిన కృష్ణుడు కృషకు- కర్షకుడై 'వామదృశాం'- గోప భామల హృదయ క్షేత్రాలలో 'క్లీం'- కామరాజ బీజం నాటాడు.

'ప్రేమైవ గోప రామాణాం కామ ఇత్యగమత్ ప్రథామ్'- గోపాంగనల దివ్యప్రేమనే 'కామం' అనే నామంతో వ్యవహరించడం లోకాచారమయింది. వారిది ప్రేమమయ కామం. అబ్జాత నయనుని- శ్రీరాముని, శ్రీకృష్ణునిపై శూర్పణఖ, కుబ్జలది కామమయ ప్రేమ. కామంతో అదుపు తప్పి అయినా అకాముని- కృష్ణుని వద్దకు కాలు కదిపితే, జీవితంలో అది ఒక పెద్ద కుదుపు- మలుపు. ఆ కామం కమనీయమైన ప్రేమగా- భగవత్కామంగా మారుతుంది. భగవత్కామం ఆమం- పచ్చి, అపరిపక్వత, రోగంతో కూడిన భౌతిక కామం కాదు. ప్రాపంచిక (ఐంద్రియ) కామం బాధకం, బంధకం. పరమాత్మ (ఆత్మీయ) కామం మోదకం, మోక్షదం.

పరీక్షిన్నరేంద్రుడు శుకయోగీంద్రుని ఇలా ప్రశ్నించాడు..

క॥ ' జారుడని కాని కృష్ణుడు
భూరి పరబ్రహ్మ మనియు బుద్ధి దలంపన్
నేరరు; గుణమయ దేహము
లేలితిన్ విడిచిరింతు? లెరిగింపు శుకా!'

గురుదేవా! గోపికలు గోవిందుని- కన్నయ్యని జారుడని- తమకు వన్నెకాని (ప్రియుని)గానే భావించి వలచారు గాని, భూరి- లోకోత్తరుడైన పరబ్రహ్మగా, వెన్నుడు (విష్ణువు) అనే తెలివితో తలచినవారు కాదు గదా! అట్టి విషయాసక్తి కల గోప భామినులు సత్త్వరజస్తమో గుణాలతో కూడిన తమ మాయామయ కాయా(దేహా)లను అంత వడిగా ఎలా పాయ-విడువగలిగారో నాకు నుడవ (చెప్ప)వయ్యా!

శుక ఉవాచ... అవనీపతీ! 'నహి వస్తుశక్తిః బుద్ధి (శ్రద్ధాదిక) మపేక్షతే' (శ్రీధరాచార్యులు)... వస్తువు- పదార్థంలోని శక్తి, అనగా దాని గుణం వినియోగదారుని బుద్ధి అనగా భావాన్ని అనుసరించి ప్రవర్తించదు. అది బుద్ధిని అపేక్షించక, స్వతంత్రంగా తన పని తాను చేసుకుపోతుంది. అమృతాన్ని విషమని భావించి తాగినా అది అమరత్వాన్ని కలిగిస్తుంది కదా! తెలిసి తొక్కినా, తెలియక తొక్కినా నిప్పు కాలుస్తుందన్న ముప్పు ఎప్పుడూ ఉంటుందిగా! స్త్రీ, పుం, నపుంసక భేదం లేక సర్వం తానే అయిన భగవంతునికి జారత్వముంటుందా? తనయందు అవ్యభిచారిణీ- అనన్యభక్తి (పరమ ప్రేమ) కలవారిని (సంసార సాగరం తారయన్ 'తారః'- శంకర భాష్యం) సంసార సాగరం నుండి 'తారుడు'- తరింపజేయు మారజనకుడు- కృష్ణుడు 'జారుడు' వ్యభిచారి అవుతాడా? జనార్దనుడు- మాయా మర్దనుడు కంసారి, జీవుల అవిద్యా కామ కర్మలను అనగా సంసారాన్ని జీర్ణింప (నశింప)జేసే జారుడు. జన్మజన్మల పాపాలను హరించే చోరుడు- జార చోర శిఖామణి!

మ॥ 'మును నే జెప్పితి జక్రి కిం బగతుడై మూఢుండు చైద్యుండు పెం
పున గైవల్య పదంబు నొందె; బ్రియలై పొందంగ రాకున్నదే?
యనఘుం డవ్యయు డప్రమేయు డగుణుండై నట్టి గోవింద మూ
ర్తి నరశ్రేణికి ముక్తి దాయిని సుమీ! తెల్లంబు భూవల్లభా!'

శుకుడు- రాజా! మూఢుడైన శిశుపాలుడు, గూఢుడు (గంభీరుడు) ఆఢ్యుడు (సమృద్ధుడు, శ్రేష్ఠుడు) అయిన మురవైరి- హరితో వైరం పూని కూడా మోక్ష పదవిని చూర గొన్నాడని, ప్రాకృత- గుణమయ శరీరాన్ని విడిచి విష్ణు పార్షదుడయ్యాడని ఇంతకుముందే నేను నీకు వివరించాను. మరి, గోవిందునికి ప్రియమైనవారు పొందరాని పదం అంటూ ఏదైనా ఉందా? అనఘుడు- పాప రహితుడు, అనంతుడు- దేశ, కాల, వస్తువుల అవధులు లేనివాడు, అప్రమేయుడు- మనోవాక్కులకు అందనివాడు, అగుణుడు- ప్రాకృత గుణ రహితుడూ అయిన

అచ్యుతుని అవతారం మానవులకు అవశ్యం- కచ్చితంగా ముక్తి దాయకం అనడంలో అనుమానమేముంది? మూలంలోని (29వ అధ్యాయం- 13, 14 శ్లో॥) రెండు శ్లోకాలకు పైమత్తేభం, పుణ్యశ్లోకుడు, భక్తి కవితా విద్యారణ్యుడు, భావుక భక్త వరేణ్యుడూ పోతన అమాత్యుని హృద్యమైన అనువాదం! 'కిముతాధోక్షజ ప్రియాః' అన్నదానికి 'చక్రి కిం.. బ్రియలై పొందంగ రాకున్నదే?' అన్నది మాకంద మాధుర్యం చిందించే అందమైన తెనుగు సేత!

ఆ॥ 'బాందవమున నైన బగనైన వగనైన
బ్రీతినైన ప్రాణభీతినైన
భక్తినైన హరికి బరతంత్రులై యుండు
జనులు మోక్షమునకు జనుదు రధిప!'

చుట్టరికంతో కాని, గిట్టని భావం- వైరంతో కాని, గుట్టయిన కామం- ప్రణయంతో కాని, తేనెపట్టు వంటి ప్రీతి- మిక్కిలి మక్కువతో కాని, కట్టి కుడుపు ప్రాణభీతి- మరణ భయంతో కాని, నందు పట్టి (బాలకృష్ణుని) యందలి రెట్టింపు భక్తితో కాని, ఎట్టి భావంతోనైనా సరే, గోవిందునికి పరతంత్రులై- ధ్యాన పరవశులై ఉండునట్టి మానవులు ముక్తి భాజనులౌతారు. 'అంతే కాదు, హరి సోకిన- తాకిన మాత్రాన గిరులూ, తరులూ మున్నగు అచరాలు- స్థావరాలు కూడా ముక్తి పొందగలవన్న విషయంలో ఎందునా సందేహం లేదు'- ఈ వాక్యం శ్రీధరుల భాష్యానికి అమాత్యుని అనువాదం.

అందరిలో అధికుడు- సాటిలేని మేటి, అనంత కల్యాణ గుణగణాల పేటి- సంపుటి, చతుర నట మూర్తి, మాటల నేర్పరి అయిన మాధవుడు తన తీయని పాట రవళిని విని తనను చూడ వచ్చిన గొల్ల చేడియలను గాంచి తన వాగ్వైభవం తేటతెల్లమగునట్లు మృదువుగా ఇలా మందలించాడు... ఇందు వదనులారా! మీకు శుభమే కదా! మీ మందకు- గోకులానికి ఎలాంటి భయాలూ లేవు గదా! సింహాలు, శార్దూలాలు (పులులు), శుండాలాలు- ఏనుగులు మొదలైన క్రూర మృగాలు సంచరించే ఈ ఘోర రాత్రివేళలో అతివలు- అబలలైన మీరు ఇంత దూరం రావచ్చునా? ఏల వచ్చారు? మీరు వచ్చిన జాడ తెలియక మీ కుటుంబ పెద్దలందరూ- 'మీరు మేరలు- హద్దులు మీరిపోయారా'ని వ్రేపల్లెలో మీకై ఎంతగా గాలిస్తున్నారో? మగువలారా! ఇంత తెగువ (సాహసం)తో కూడిన పనులు మీకు తగునా? ఇంటి మర్యాదను బుగ్గి గావించి, మగవారిని సిగ్గులపాలు చేసి, అత్తమామలకు, తల్లిదండ్రులకు, తోబుట్టువులకు ఎగ్గు (అనాదరం, కీడు) కలిగిస్తూ కుల స్త్రీలు జార- మారు మగల మీది మరుల (మోహాల)తో ఇలా అరుదెంచవచ్చునా? లోకులు మెచ్చుకొంటారా? 'జారు జేర జనదు చారుముఖికి'- సతీమతల్లి- సాధ్వీమణికి ఉపపతి- జారునితో పొత్తు వాంఛనీయం కాదు.

చ॥ 'ఇది యమునా నదీ జల సమేధిత పాదప పల్లవ ప్రసూ
న దళ విరాజితంబగు వనంబు, మనంబుల మేర దప్పెనో?
పొదడటు నేడ్చు బిడ్డలకు బోయుడు పాలు, విడుండు లేగలన్
మొదవులకున్, నిజేశ్వరుల ముద్దియలార! భజించుడొప్పుగన్'

సుందరీమణులారా! ఇది యమునా తీరమందలి అందమైన బృందావనం. సమృద్ధమైన జలాలతో గుబురుగా పెరిగిన చెట్లు చక్కని చిగురుటాకులతో, రెక్కలు తొడిగిన పూల గుత్తులతో చూడ సొంపుగా ఉన్నాయి. అచ్చట ముచ్చట (వేడుక) తీర్చుకొని ఇచ్చోటనుండి వెడలిపొండి. మీ మనసులు హద్దులు మీరాయి. ఇక మందకు మరలిపొండి. మీకై పలవరిస్తున్న మీ ముద్దుల పిల్లలకు పాలివ్వండి. మొదవు- పాడి ఆవులకు దూడలను వదలండి. కాంతలారా! నన్ను కోరి నాపై భ్రాంతి- అపేక్షతో మీరిచ్చటికి వచ్చారు. మీకు ఎంత మాత్రం కొరత లేదు. మీకు మేలే జరుగుతుంది. సఖులారా! మీరే కాదు, అఖిల ప్రాణులూ నాకు ప్రియమైనవే. ఐనా, మీరిచ్చట నిలువ రాదు. పతిసేవయే పడతులకు పరమధర్మమని పెద్దలు పలుకుతూ ఉంటారు.

క॥ 'ధ్యానాకర్ణన దర్శన
గానంబుల నా తలంపు గలిగిన జాలుం
బూనెదరు కృతార్థత్వము
మానవతుల్! చనుడు మరలి మందిరములకున్'

'చెలులారా! అలుపెరుగక నన్ను తలచుట, నన్ను గూర్చి వినుట, నను కనుట, నాపైని పాటలు పాడుట, ఇలా అంచితం (శ్రద్ధ)గా నాయెడ మనసుంచితే చాలు. మీరు ధన్యురాండ్రవుతారు. ఇక మీరు మాటాడక మీ మందిరాలకు మరలిపొండి'.

(సశేషం)

జంటయుగాల కేళి.. దీపావళి

'దీపావళి' అంటే దీపాల వరుస అని అర్థం. ఈ రోజున ప్రజలంతా దీపాలను వెలిగించి, శ్రీకృష్ణుడికి సమర్పించి, ఆపై వాటిని ఇంట్లోగానీ లేదా ఇంటి ప్రాంగణంలో గానీ వరుసలలో అమర్చుతారు. హైందవ సంప్రదాయంలో కొన్నిచోట్ల దీపావళి పండుగను నూతన సంవత్సర దినంగా కూడా పాటిస్తారు. దీపావళి వెనుక పురాణోక్తమైన కథలు ఎన్నో ఉన్నాయి. త్రేతాయుగంలో రావణాసురుణ్ని సంహరించిన తర్వాత శ్రీరామచంద్రుడు అయోధ్య నగరంలోకి ప్రవేశించి, సింహాసనం అధిష్ఠించిన పర్వదినం ఇదే! ద్వాపరంలో అల్లరి పిల్లవాడైన శ్రీకృష్ణున్ని యశోదమ్మ రోలుకు కట్టేయడం, చిన్ని కృష్ణుడు.. ఊపున బోయి మానులను కూల్చిన లీలను ప్రదర్శించిన రోజూ ఇదే. శ్రీకృష్ణ ఇష్టసఖి సత్యభామ.. నరకాసురుణ్ని సంహరించిన సందర్భంగా దీపావళి చేసుకుంటున్నాం.

శ్రీరామచంద్రుడు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంలో 'సోదరుడైన భరతుడు ఆహ్వానించగా, ఉత్సవ శోభితమైన అయోధ్యలో శ్రీరామచంద్రుడు ప్రవేశించాడు' అని శ్రీమద్భాగవతం పేర్కొన్నది. ఆనాటి ఉత్సవమే నేటికీ దీపావళిగా కొనసాగుతున్నది. రాముడి రాకతో అయోధ్యవాసులు ఎంతగా పరవశించిపోయారంటే, గాఢనిద్ర నుండి అప్పుడే స్పృహలోకి వచ్చినట్లు వారంతా భావించారు. వీధులన్నిటినీ విశేషంగా అలంకరించి, ఇంటి ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి, వీధి చివర్లలో అరటి తోరణాలను కట్టారట. మంగళకరమైన వాద్యాలతో దేవాదిదేవుడైన శ్రీరామ

చంద్రుడిని నగరంలోకి స్వాగతించారట. శ్రీరామచంద్రుడు అవతరించిన త్రేతాయుగంలో ఆరంభమైన ఈ దీపావళి, యుగయుగాలుగా కొనసాగుతూనే ఉండటం విశేషం. ప్రామాణిక సంప్రదాయాలు, గురుశిష్య పరంపరల కారణంగా ఈ సంప్రదాయం నేటికీ సజీవంగా ఉంది. దీపావళి ఉత్సవానికున్న మరో విశేషం దామోదర లీల. దీపావళి రోజున సంభవించిన దామోదర లీల కారణంగానే కార్తిక మాసానికి దామోదర మాసమని పేరు వచ్చింది. అసలు శ్రీకృష్ణుడికి 'దామోదరుడు' అనే పేరు ఎలా వచ్చిందో హరివంశం (విష్ణు పర్వము 7.36)లో కనిపిస్తుంది. 'స చ తేనైవ నామ్నా తు కృష్ణో వైదామ బంధనాత్ గోప్యే దామోదర ఇతి గోపీభిః పరిగీయతే'- సంస్కృతంలో 'దామం' అంటే 'తాడు' అని, 'ఉదర' అంటే 'పొట్ట' అని అర్థం. కొంటెచేష్టలు చేస్తున్న చిన్నికృష్ణుడి ఉదరాన్ని తల్లి యశోదమ్మ తాడుతో చుట్టి రోకలికి కట్టివేసిన లీలా వృత్తాంతపరంగా కన్నయ్యకు ఏర్పడిన నామమే 'దామోదర'. దీపావళి నాడే ఈ దామోదర లీల కూడా జరిగిందని శ్రీల సనాతన గోస్వామి రచించిన 'బృహద్ వైష్ణవ తోషని' గ్రంథం ఆధారంగా ఆచార్య శ్రీల విశ్వనాథ చక్రవర్తి ఠాకూరుల వారు వివరించారు.

దీపావళి సందేశం

పండుగలన్నీ ఏదో ఒకవిధంగా భగవంతుడైన శ్రీకృష్ణుడు లేదా శ్రీరామచంద్రునికి సంబంధించినవై ఉంటాయి. ఆ భగవత్సంబంధాన్ని

గురువారం దీపావళి

తెలుసుకొని సరైన అవగాహనతో, భక్తి భావనతో ఈ పండుగలను జరుపుకొన్నప్పుడు వాటివల్ల ఎంతో ఆధ్యాత్మిక ప్రయోజనం కలుగుతుంది. తత్ ఫలితంగా భగవంతుని లీలల్లో మనమూ భాగమయ్యే భాగ్యం దక్కుతుంది. ఈ ఉత్సవాల్లోని ఆంతర్యాన్ని గ్రహిస్తే పండుగ పరమానంద భరితంగా మారుతుంది.

ఇలా చేసుకుందాం..

- యశోదా దామోదరకు నేతి దీపాన్ని సమర్పించి, ఇంటి ముంగిళ్లను దీపాలతో అలంకరించాలి.
- అయోధ్యలో శ్రీరామచంద్రుని పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకొని, ఆ వేడుకను బాణసంచాతో, దీపాలతో మనమూ జరుపుకోవాలి.
- ఇంటి ముందు శుభ్రం చేసి ముగ్గులను వేయవచ్చు.
- పాలు, వెన్న, నెయ్యితో చేసిన చక్కని మిఠాయిలను శ్రీకృష్ణుడికి సమర్పించి, కుటుంబసభ్యులు, బంధువులు, ఇరుగుపొరుగు వారందరికీ పంచిపెట్టాలి. ప్రసాద వితరణ కృష్ణపరమాత్మకు ఎంతో ప్రీతికరమైనది.
- శ్రీకృష్ణుడికి సమర్పించిన తర్వాత కొత్త వస్త్రాలు ధరించి శక్తిమేరకు బహుమతులు ఇచ్చిపుచ్చుకోవాలి.
- భగవంతుడి ప్రీత్యర్థం బంగారం, కొత్త వంట పాత్రలను కొనుగోలు చేసే సంప్రదాయమూ ఉంది.

... శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ, 93969 56984

రావమ్మా.. మహాలక్ష్మి!

బుధవారం ధనత్రయోదశి

దీపావళి సంతసం ధన త్రయోదశితో మొదలవుతుంది. ఆశ్వయుజ బహుళ త్రయోదశి నాడు ఈ పర్వం నిర్వహించుకుంటారు. ధన త్రయోదశి నాడు మహాలక్ష్మి వైకుంఠం నుంచి భూలోకానికి వస్తుందని, ప్రతి లోగిలిలో సంచరిస్తుందని పెద్దలు చెబుతారు. శుచి, శుభ్రత, సంప్రదాయం పాటించే ఇంట్లో కొలువుదీరుతుందట. అందుకే, అమ్మవారికి స్వాగతం పలుకుతూ ఉదయాన్నే ఇల్లూ, వాకిలీ శుభ్రం చేసుకొని, ముగ్గులు తీర్చిదిద్దాలి. ఇంట్లోవారంతా అభ్యంగన స్నానం చేసి, శుభ్రమైన వస్త్రాలు ధరించి, పూజా మందిరాన్ని మంగళకరంగా అలంకరించుకొని లక్ష్మీ పూజ చేయాలి. అలాంటి ఇంట్లో లక్ష్మీదేవి అడుగుపెడుతుంది. ఇక లక్ష్మీదేవి పూజలో భాగంగా ఇంట్లో వెండి వస్తువులు, బంగారు ఆభరణాలు ఆవుపాలతో శుభ్రం చేసి పూజామందిరంలో ఉంచాలి. లక్ష్మీ స్వరూపంగా భావిస్తూ వాటిని పూజించాలి. సంపదను సత్కార్యాలకు సద్వినియోగం చేయటమే లక్ష్మీదేవి ఆరాధనలో ఆంతర్యం. ఇందుకు తగిన సంకల్పంతో దీక్షను పొందడానికి ధనత్రయోదశి వేదికగా నిలుస్తుంది. ఆనాడు లక్ష్మీపూజ చేసినవారికి అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని 'చతుర్వర్గ చింతామణి' గ్రంథం వివరిస్తున్నది. ఆనాటినుంచి దీపావళి వరకు మూడురోజులపాటు 'గో త్రిరాత్ర వ్రతం' నిర్వహించాలని, గోమాతను లక్ష్మీ స్వరూపంగా గుర్తించి గో సేవ చేయాలనీ ఆ గ్రంథం చెబుతున్నది. ధనత్రయోదశి నాడు పితృదేవతలు తమ వారసులను ఆశీర్వదించటానికి భూమికి దిగి వస్తారని, వారికి దారి చూపటానికి ఇంటిలో దక్షిణం వైపుగా దీపం పెట్టాలని కూడా పెద్దలు సూచించారు. దీనిని ఆచరించినవారికి అపమృత్యు దోషాలు తొలగిపోతాయి. ఆవు నెయ్యితో వెలిగించిన దీపాలతో ఇంటిని అలంకరించి, దీపదానం చేయటం కూడా సంప్రదాయంలో భాగం. లక్ష్మీపూజ, గోసేవ, దీపారాధన, దీపదానం, పితృదేవతారాధన ఇవన్నీ ధన త్రయోదశి ప్రత్యేకతలు.

... కీర్తన

వృద్ధులను గౌరవిద్దాం

ఇస్లాం బోధ

వృద్ధులంటే జీవిత సారాన్ని గ్రహించిన అనుభవజ్ఞులు. ముదిమి వయసులో కొన్ని పనులు చేసుకోలేరు. అందుకు వారు సంతానంపై, ఇతరులపై ఆధారపడతారు. వారిని గౌరవించి, సేవలు చేయడం మన విధి. వృద్ధుల విశిష్టతను, వారితో ఎలా ప్రవర్తించాలనే విషయాలను ఖురాన్ స్పష్టంగా వివరించింది. 'మీ ముందు వారిద్దరి (తల్లిదండ్రులు)లో ఎవరైనా వృద్ధులై ఉంటే వారిని అస్సలు విసుక్కోవద్దు. వారితో గౌరవంగా మాట్లాడాలి. దయార్ద్ర హృదయంతో, వినయంతో వారి ముందు తలవంచి ఉండండి' అని ఖురాన్ బోధ. 'ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్సల్యంతో పెంచి పోషించారో అలా నీవు వారిని కరుణించు' అని ప్రార్థించాలని ఖురాన్ సూచించింది. అల్లామా షబ్బీర్ అహ్మద్ ఉస్మాని (రహ్మ)పై వాక్యాలకు వివరణ చెబుతూ.. 'వృద్ధులకు సంతానంతో సేవలు చేయించుకోవాల్సిన అవసరం ఎక్కువగా ఉంటుంది. కొన్నివేళల్లో అయినవారు కూడా వృద్ధులను విసుక్కుంటారు. వృద్ధాప్యంలో బుద్ధి వివేకాలు పని చెయ్యవు. ఇలాంటి సందర్భంలో గొప్ప సౌభాగ్యవంతులైన బిడ్డలు వృద్ధులైన తమ తల్లిదండ్రులకు సేవ చేయడంలో ఎలాంటి అలసత్వానికి, సోమరితనానికి, ఏమరుపాటుకి చోటివ్వకూడదు. వారికి సేవ చేయకుండా ఉండటానికి

సాకులు వెతకకూడదు. సముద్ర కెరటాల్లా ఎగసిపడే మీ ఆలోచనలతో ఎగిరెగిరి అలసిపోయిన వారి ఆలోచనలు సర్దుబాటు కాలేకపోవచ్చు. అయినా మీరు వారిని 'ఉఫ్ఁ' విసుక్కోవడానికి కూడా వీల్లేదని ఖురాన్ హెచ్చరించింద'ని పేర్కొన్నారు.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

క్రీస్తు సందేశం

దైవాన్నైనా.. అడగాల్సిందే!

చాలా మంది ప్రార్థన గురించి తమకేం తెలియదంటూ, వారి వారి సమస్యలన్నీ మనసు విప్పి చెప్పేస్తారు. కావలసినవీ అడుగుతారు. అయితే విచిత్రమేమంటే వారి అభ్యర్థనలో ప్రార్థన ఉందని వారు గుర్తించలేరు. ఎప్పుడూ సామాన్య జనంతో తిరిగే ప్రభువు.. ఏకాంతంగా ఒకసారి ప్రార్థన చేసుకొని, తిరిగి వచ్చాడు. ఆ శిష్యుల్లో ఒకరు 'మాకూ ప్రార్థించడం ఎలాగో నేర్పించండి' అని ప్రభువును అడిగాడు. అసలు మనకేం కావాలో దేవుణ్ని అడగాల్సిన అవసరం ఉందా, అనేది కొందరి అనుమానం! 'మీరు మీ తండ్రిని అడుగక మునుపే మీకు అక్కరగా నున్నవేవో ఆయనకు తెలియును' (మత్తయి 6:8) అని వాక్యం. అయినప్పటికీ, 'అడగాల్సిందే!' అన్నట్టుగా సమాధానం ఇచ్చారు ప్రభువు. అడగనిది అమ్మయినా పెట్టదు కదా! దేవుడు సర్వజ్ఞుడైనా.. అమ్మను అడిగినట్టు.. ఆ దైవాన్నీ మనకేం కావాలో కోరాలి. 'ఆయన రహస్యంగానే ఉంటాడు. రహస్యంగానే వింటాడు' (మత్తయి 6:4).



... ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024